

నేటి నుంచి బస్సు సౌకర్యం

ప్రజాశక్తి-పాలకొండ

ఈ నెల 10వ తేదీ నుంచి పాలకొండ నుంచి దోనుబాయి వరకు సీతంపేట మీదుగా బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్టు డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎంఎల్ఎ కళావతితో పాటు దోనుబాయి గ్రామస్తుల వినతి మేరకు ఈ సదుపాయం కల్పించినట్టు చెప్పారు. దీన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. అలాగే దోనుబాయికి బస్సు సౌకర్యం కల్పించడంతో ఆయా ప్రాంతాల గిరిజనులు, ఉద్యోగులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఖరీఫ్‌కు సాగునీరు ప్రశ్నార్థకమే



- నత్త నడకన పెద్దగెడ్డ ఆధునీకరణ పనులు
- రెండున్నరేళ్లయినా 20 శాతమే పనులు పూర్తి
- త్వరగా పూర్తి చేయాలంటూ రైతులు మొర

ప్రజాశక్తి - పాచిపెంట

పార్వతీపురం మన్యం జిల్లాలోని కీలక సాగునీటి వనరుల్లో ఒకటి మండలంలోని పెద్దగెడ్డ రిజర్వాయర్. దీని ద్వారా మూడు మండలాలకు సుమారు 12 వేల ఎకరాలకు సాగునీరందుతుంది. దీనిపై ఆధారపడి ఎంతో మంది రైతులు గత పదహారేళ్లుగా సాగు చేస్తున్నారు. పెద్దగెడ్డ జలాశయం ఆధునీకరణ పనులకు జైకా నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో పనులు ప్రారంభించి రెండున్నరేళ్లయినా ఆధునీకరణ పనులు ఇంకా కొనసాగుతుండడంపై అన్నదాతలకు అవస్థలు తప్పడం లేదు. పనులు నత్తనడకన కొనసాగడంతో ఈ ఖరీఫ్‌కు నీరు అందుతుందో లేదో అంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇందులో భాగంగా శివారు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో నీరు అందడం లేదు. దీంతో ఏటా రైతులు వరుణుడిపైనే ఆధారపడి సాగు చేపట్టాల్సి వస్తుంది. అలాగే పంటలు సక్రమంగా పండకపోవడంతో అనేక మంది రైతులు నష్టపోతున్నారు. ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కాకపోవడం పట్ల ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవడంపై రైతుల నుంచి విమర్శలు వెళువెత్తుతున్నాయి.

పెదగెడ్డ జలాశయం ప్రధాన కాలువ ద్వారా 7,500 ఎకరాలకు ప్రాజెక్టు అనుసంధానమైన కర్రివలస వేగావతి ఆనకట్ట కుడి ఎడమల కాలువల ద్వారా 4,500 ఎకరాలకు సాగునీరందుతుంది. ప్రధాన కుడి, ఎడమ కాలువలు 10కిలోమీటర్ల పనులు చేపట్టాల్సి ఉంది. అలాగే పాచిపెంట, సాలూరు, రామభద్రపురం మండలాలకు సంబంధించి 23 గ్రామాల రైతులు ఈ జలాశయంపై ఆధారపడి పంటలు పండిస్తున్నారు. అయితే ప్రాజెక్టు ఆధునీకరణ పనులు ప్రారంభించి రెండున్నరేళ్లు గడిచినప్పటికీ పూర్తి కావడం లేదు. కేవలం 20 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఆధునీకీకరణ పనులకు సంబంధించి రెండున్నర ఏళ్ల క్రితం జైకా నుంచి సుమారు రూ.23 కోట్లు మంజూరయ్యాయి. ఈ మొత్తంతో పెద్దగెడ్డ జలాశయం ప్రధాన కాలువ, కర్రివలస వేగావతి ఆనకట్ట, కుడి, ఎడమ కాలువ లైనింగ్ స్పిల్‌వే వద్ద కూడా పనులు చేయాల్సి ఉంది. ప్రారంభించిన నాటి నుంచి పనులు నత్తనడకగానే కొనసాగుతున్నాయి. 18 కిలోమీటర్ల మేర కాలువ లైనింగ్ పనులు చేయాల్సి ఉండగా పది కిలోమీటర్ల వరకే ఎర్త్ వర్క్ లైనింగ్ పనులు జరిగాయి. పనులు ప్రారంభించి రెండున్నరేళ్లకు 20శాతం పనులు పూర్తి కావడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులకు నీరు సక్రమంగా అందుతుందో లేదో అంటూ ఆవేదన చెందుతున్నారు. గత ఏడాది డిసెంబర్ 5నాటికి పనులు పూర్తి కావాల్సి ఉంది. అయితే ఆధునీకరణ పనులు నత్తనడకన సాగడంపై అన్నదాతల పెదవి విరుస్తున్నారు. కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు కాకపోవడమే పనులు నత్తనడకన కొనసాగుతున్నాయని బహిరంగంగా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి ఈ ఖరీఫ్ నాటికి ఆధునీకరణ పనులు పూర్తిచేసి శివారు భూములకు సాగునీరు అందించాలని ఆయా ప్రాంత రైతులు కోరుతున్నారు.

శివారు ఆయకట్టు నీరందేలా చర్యలు తీసుకోవాలి



పెద్దగెడ్డ జలాశయం ప్రధాన కాలువతో పాటు పిల్ల కాలువలను బాగుచేసి ఆయకట్టు శివారు భూములకు నీరందేలా చర్యలు చేపట్టాలి. కాలువలో పూడికలు, పిచ్చి మొక్కలు పేరుకుపోవడంతో శివారు భూములకు చుక్క నీరు అందడం లేదు. కావున పిల్ల కాలువ పనులు సక్రమంగా చేపట్టి ఆయకట్టు రైతులను ఆదుకోవాలి.

గొర్లి సోమినాయుడు.
మిర్తి వలస ,
పెద్దగడ్డ జలాశయం ఆయకట్టు రైతు.



ఎడమ కాలువ వద్ద చేపడుతున్న ఎర్త్‌వర్క్ లైనింగ్ పనులు

డిసెంబర్ నెలాఖరుకు పనులు పూర్తి



ఇటీవల జైకా బృందం వచ్చి పనులను పరిశీలించింది. పెద్దగెడ్డ కాలువ నిర్మాణ పనులు ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరుకు పూర్తి కావాలని జైకా ప్రతినిధులు కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ మేరకు తాము కూడా ప్రతిరోజూ పనులు పూర్తి చేయాలంటూ కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెస్తున్నాం. బిల్లులు సక్రమంగా మంజూరు కాకపోవడం కూడా ఒక కారణం.

పి.కనకారావు,
డిఇ, పెద్దగెడ్డ.

ఖరీఫ్‌కు సాగునీరందించాలి



త్వరితగతిన కాలువ పనులు పూర్తి చేసి ఈ ఖరీఫ్‌కు సాగునీరందించేలా చర్యలు తీసుకోవాలి. పక్కనే రిజర్వాయర్ ఉన్నా సాగునీరందకపోవడంతో వర్షాలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి. కావును కాలువ పనులు త్వరితగతిన పూర్తి చేసి సాగునీరు ఇవ్వాలి.

యవర్న శంకరరావు,
తోటవలస,
పెద్దగెడ్డ జలాశయం ఆయకట్టు రైతు.



మాట్లాడుతున్న ఇఐడి ప్యారి చక్కెర పరిశ్రమ అసోసియేట్ ఉపాధ్యక్షులు నాగశేషారెడ్డి

16తో చెరకు క్రషింగ్ పూర్తి

ఇఐడి ప్యారి చక్కెర పరిశ్రమ అసోసియేట్ ఉపాధ్యక్షులు నాగశేషారెడ్డి

ప్రజాశక్తి-రేగిడి

సంకిలి ఇఐడి ప్యారి చక్కెర పరిశ్రమలో ఈ ఏడాది చెరకు క్రషింగ్ ఈ నెల 16తో పూర్తి చేయనున్నట్లు ఆ సంస్థ అసోసియేట్ ఉపాధ్యక్షులు ఎ.నాగ శేషారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. 2022-2023 ఏడాదికి చెరకు క్రషింగ్ 5.85 లక్షల మెట్రిక్ టన్నులు లక్ష్యం కాగా ఆదివారానికి 4.53 లక్షల మెట్రిక్ టన్నులు పూర్తి చేసినట్లు తెలిపారు. మరో ఏడు రోజుల్లో చెరకు క్రషింగ్ పూర్తి చేస్తామని వెల్లడించారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో చెరకు ఉన్న రైతులు కటింగ్ పర్మిట్ల కోసం సిడిఒ, సిడిఎ, నేరుగా కార్యాలయంలో కలవాలని కోరారు. ఇంతవరకు సహకరించిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఏడాదికి చెరకు క్రషింగ్‌కు యాజమాన్యం సూచించిన రకాలకు సంబంధించి మొక్కలు నాటాలని కోరారు. రైతుల పెట్టుబడి దృష్టిలో ఉంచుకొని భారీ రాయితీలు ప్రకటించామన్నారు. 2022 అక్టోబర్ నుంచి ఈ ఏడాది ఏప్రిల్ నెలాఖరు వరకు మామూలు పద్ధతిలో చెరకు నాటిన రైతులకు ఎకరానికి రూ.7 వేలు, దూరపు చాళ్ల పద్ధతిలో నాటే రైతులకు రూ.8 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పూర్తి రాయితీ పొందుటకు ఎకరానికి 29 టన్నుల చెరకు సరఫరా చేయాలన్నారు. ప్రత్యేక రాయితీలో భాగంగా 25 టన్నుల చెరకు సరఫరా చేసిన రైతులకు 2024 జనవరి 16 నుండి ఫిబ్రవరి నెలాఖరు వరకు టన్నుకు అదనంగా రూ.75 చెల్లిస్తామన్నారు. 2024 మార్చిలో చెరకు అందిస్తే రూ.125, ఏప్రిల్ ఒకటి నుంచి క్రషింగ్ పూర్తయ్యే వరకు చెరకు సరఫరా చేసే రైతులకు రూ.175 చొప్పున అదనంగా రాయితీలు ఇస్తామన్నారు. యాజమాన్యం ప్రకటించిన రాయితీలో రూ.2,250.. 45 రోజులలో ఇస్తామన్నారు. మిగిలిన రాయితీ రూ.5,750 చెరకు పంట పూర్తిగా కర్మాగారానికి తరలించిన తరువాత దిగుబడి ప్రాప్తికి బిల్లులు చెల్లిస్తామన్నారు.

సమావేశంలో కేన్ జిఎం రమేష్‌కుమార్‌రెడ్డి, కేన్ సీనియర్ మేనేజర్ కిల్లి అప్పారావు, ఫైనాన్షియర్ ఎన్.సింహాద్రి పాల్గొన్నారు.

135 కిలోల గంజాయి పట్టివేత

శృంగవరపుకోట : మండలంలోని ముసిడిపల్లి పంచాయతీ దొర్లపాలెం వద్ద 135 కేజీల గంజాయి పట్టుబడిందని ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. ఒడిశా రిజిస్ట్రేషన్ గల కారులో గంజాయి అక్రమంగా రవాణా అవుతుందన్న సమాచారంతో ఎస్ఐ తన సిబ్బందితో వెళ్లారు. నిందితులు దొర్లపాలెం వద్ద కారును వదిలి పరారయ్యారు. కారు డిక్కి తెరిచిచూస్తే 135 కిలోల గంజాయి లభించిందని ఎస్ఐ తెలిపారు.



పట్టుబడిన గంజాయి, కారుతో పోలీసులు

డిసిఎంఎస్ స్థలంలో ఆక్రమణలు

ప్రజాశక్తి-పాలకొండ

డివిజన్ కేంద్రమైన పాలకొండ నగర పంచాయతీలో భూముల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. సెంటు స్థలం లక్షల్లోనే విలువ పలుకుంది. దీంతో ఆక్రమణదారుల ఆగడాలు మితిమీరాయి. ఖాళీస్థలం ఉంటే కబ్జా అయిపోతుంది. అది ప్రైయివేట్ స్థలమా, ప్రభుత్వ స్థలమా అవసరం లేదు. సంబంధిత అధికారులు కూడా ఉదాసీనత చూపడంతో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. పట్టణం నడిబొడ్డున డిసిఎంఎస్ స్థలం కబ్జాకు గురైంది. 25 సెంట్లు స్థలం ఉండగా అందులో 5 సెంట్లు కబ్జాకు పాల్పడ్డారు. ఏకంగా నిర్మాణాలు కూడా జరిగిపోతున్నాయి. దీంతో పలువురు ముక్కున వేలేసుకుంటున్నారు. డిసిఎంఎస్ స్థలం ఇతర ప్రభుత్వ అవసరాలకు ఇవ్వాలంటే కచ్చితంగా అనుమతి తీసుకోవాల్సి ఉంది. అటువంటిది ఎటువంటి అనుమతుల్లేకుండా ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపట్టడంతో విమర్శలు వినిపిస్తున్నాయి.

చోద్యం చూస్తోన్న అధికారులు

అక్రమ నిర్మాణాలకు హౌసింగ్ బిల్లులు....

డిసిఎంఎస్ స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న ఇళ్లకు బిల్లులు కూడా మంజూరైనట్టు తెలుస్తోంది. తప్పుడు పత్రాలు సృష్టించి హౌసింగ్ బిల్లులు పొందినట్టు తెలుస్తోంది. ఇంత జరుగుతున్నా అధికారులు దృష్టిపెట్టకపోవడంతో సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణంలో మెయిన్ రోడ్డు దగ్గర ఇంత జరుగుతున్నా ఏ ఒక్కరూ ఎందుకు దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

నిర్మాణాలు నిలుపుదల చేయించాం
పి.సోమేశ్వరరావు, తహశీల్దార్.

డిసిఎంఎస్ స్థలంలో నిర్మాణాలు జరుగుతున్నట్టు రెండు రోజుల క్రితమే మా దృష్టికి వచ్చింది. దానిపై దృష్టిపెట్టాం. నిర్మాణాలు నిలిపివేయించాం. వారికి నోటీసులు కూడా అందజేస్తాం.

ఎన్.కె.రాజపురంలో దారుణం

హత్యకు గురైన వ్యక్తి
హంతకులను అరెస్టు చేయాలని ఆందోళన

ప్రజాశక్తి-పాలకొండ/పాలకొండ రూరల్

పట్టణంలోని ఎన్.కె.రాజపురంలో ఈనెల 6న సాయంత్రం బహిర్భూమి వద్ద శివశంకర్, మోహనరావు అనే ఇద్దరు యువకులు మధ్య వివాదం చోటుచేసుకుని ఘర్షణగా మారింది. తప్పతాగి ఉన్న మోహనరావుపై దాడిచేశారు. అనంతరం చందక శివశంకర్‌తో పాటు మరికొంత మంది మోహనరావు ఇంట్లోకి వెళ్లి గృహోపకరణాలను ధ్వంసం చేసి మోహనరావు మామయ్య అయిన ఎం.చంద్రరరావును గాయపర్చారు. గుండెపై బలంగా కొట్టారు. దీంతో చంద్రరావు గాయాలపాలవ్వడంతో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకువెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించడంతో వైద్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున చంద్రరావు మరణించాడు.

పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన....



పోలీసు స్టేషన్ ముందు బైఠాయించిన మృతుని కుటుంబీకులు

చంద్రరావు మృతికి కారణమైన వారిని ఇంతవరకు ఎందుకు అరెస్టు చేయలేదని నిరసిస్తూ ఆదివారం సాయంత్రం స్థానిక పోలీసు స్టేషన్ వద్ద గ్రామస్తులు ఆందోళనకు దిగారు. అసలైన వారిని పట్టుకోకుండా సంబంధం లేనివారిని స్టేషన్‌కు తీసుకురావడం ఏమిటని నిలదీశారు. చంద్రరావు మరణించినంత వరకు ఆ ప్రాంతానికి ఎందుకు రాలేదని ప్రశ్నించారు. నలుగుర్ని అదుపులోకి తీసుకున్నామని, మిగిలిన వారిని కూడా గుర్తిస్తామని పోలీసులు చెప్పగా దానికి గ్రామస్తులు అడ్డుతగిలారు. పోలీసుస్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పట్టుకున్న వారి పేర్లు బహిర్గతం చేయాలని, మిగిలిన వారిని ఎప్పటిలోగా అదుపులోకి తీసుకుంటారో చెప్పాలని నిలదీశారు. దీంతో కొంతసేపు ఉద్రిక్తతకు దారితీసింది. దీంతో పోలీసులు మృతికి కారణమైన వారందర్నీ గుర్తించి అరెస్టు చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్.కె.రాజపురం ప్రాంతీయులకు మద్దతుగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ వెన్నపు శ్రీనివాసరావు, కౌన్సిలర్ ప్రతినిధి నీలాపు శ్రీనివాసరావు ఉన్నారు.

ఇంత నిర్లక్ష్యమా?

మందకొడిగా ఏరియా ఆసుపత్రి పనులు
కనీస సౌకర్యాల్లేక వైద్యులు, రోగులకు అవస్థలు


ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఐటిడిఎ పరిధిలోని గిరిజనులకు స్థానిక ఏరియా ఆస్పత్రి వైద్యసేవలకు పెద్దదిక్కుగా ఉంది. భామిని, సీతంపేట, వీరఘట్టంతో పాటు పక్కనే ఉన్న శ్రీకాకుళం జిల్లాలోని కొత్తూరు తదితర మండలాలకు చెందిన గిరిజనులకు ఏ చిన్న అనారోగ్యమొచ్చినా స్థానిక ఏరియా ఆస్పత్రినే ఆశ్రయిస్తున్నారు. అలాంటి ఆసుపత్రి అభివృద్ధి పనులపై అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వహించడంతో వైద్యం కోసం రోగులు, వైద్య సిబ్బంది అనేక ఇబ్బందులు పడుతున్నారు.



2020లో సీతంపేట సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని వంద పడకల ఆసుపత్రిగా స్థాయి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.19.7 కోట్లు మంజూరు చేసింది. అయితే ఆసుపత్రి అభివృద్ధి పనులు మందకొడిగా జరగడంతో రోగులు, వైద్యాధికారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో అంతవరకు బాగానే ఉంది. అయితే అందుకు సంబంధించిన కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పనులు జాప్యం జరుగుతున్నాయి. రెండేళ్లు కరోనా ఉన్నప్పటికీ 2023 మార్చి నాటికి పూర్తి స్థాయిలో పూర్తి చేయాల్సి ఉంది. అయినప్పటికీ కనీసం 50 శాతం కూడా పూర్తిగా కాకపోవడంతో పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఆసుపత్రికి రోజుకు 300మందికి పైగా రోగుల తాకిడి ఉంది. ఇప్పటికే 23 మంది వైద్య నిపుణులకు 20 మంది స్పెషలిస్టులు ఉన్నారు. ఒక్కొక్క స్పెషలిస్ట్‌కు ఒక్కొక్క గది ఉండాల్సి ఉంది. అయినప్పటికీ ఒక గదిలో నలుగురు వైద్యాధికారులు ఉంటూ రోగులకు ఇరుకు గదులోనే వైద్య సేవలు అందించాల్సిన పరిస్థితి నెలకొంది. మరో పక్క సూపరింటెండెంట్ గదిలోనే వైద్య పరీక్షలు చేస్తున్నారు. రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించినా ఇరుకు గదుల్లోనే వసతి ఇవ్వాల్సి వస్తోంది. బ్లడ్ స్టోరేజ్ యూనిట్ మంజూరై ఏడాది కావస్తున్నా, దీనికి అనుకూలమై గది లేకపోవడంతో ఆ యూనిట్ మూలన పడి ఉంది. ఇంకా ఆలస్యమైతే బ్లడ్ స్టోరీ యూనిట్ వెనక్కి వెళ్లిపోవాల్సిన ప్రమాదం ఉంది. సీతంపేట ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి నాబార్డ్ నిధులు రూ.19.7 కోట్లు మంజూరయ్యాయి. 15 నెలల్లో పనులు పూర్తి చేయాల్సి ఉందిగా, ఇప్పటి వరకూ కేవలం 50శాతం పనులు కూడా జరగలేదు. ఇంకా శ్లాబ్ వేయాల్సి ఉంది. పూర్తిస్థాయిలో అధికారులుండీ, సకాలంలో వైద్య సేవలు అందించడంతో పాలకొండ, సీతంపేట, భామిని, కొత్తూరు తదితర ప్రాంతాల నుంచి రోగులు వచ్చి స్థానిక ఏరియాలో వైద్య సేవలు పొందుతున్నారు.

వసతులుంటే మరిన్ని సేవలు



ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో వసతులు కల్పిస్తే రోగులకు మరింత మెరుగైన సేవలందించేందుకు అవకాశం ఉంటుంది. పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బంది ఉండడంతో పాటు వారు కూడా సేవలందించేందుకు ఉంతో ఉత్సాహంగా ఉన్నారు. కావున త్వరితగతిన భవన నిర్మాణాలు పూర్తి చేయాలి.

బి శ్రీనివాసరావు,
సూపరింటెండెంట్,
ఏరియా ఆసుపత్రి, సీతంపేట.

ఆగస్టులోగా పనులు పూర్తి చేస్తాం

ఆసుపత్రిలో పెండింగ్ పనులు ఆగస్టులో పూర్తిస్థాయిలో పూర్తవుతాయి. మార్చిలోనే పనులు పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ బిల్లులు జాప్యం జరగడంతో ఆలస్యమైంది. ఇప్పటికీ మరో రూ.90 లక్షలు రావాల్సి ఉంది. అయితే పనులు శరవేగంగా పూర్తి చేయడానికి కృషి చేస్తాం.

ఎన్ ఇంద్రసేన,
జెఇ, సీతంపేట.

రీసర్వేతోనే భూ సమస్యలు పరిష్కారం

- పూర్తిస్థాయిలో సర్వేయర్ల నియాకం అవసరం
- 'ప్రజాశక్తి'తో జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్ అధికారి రాజ్‌కుమార్‌తో ముఖాముఖి



వందేళ్ల క్రితం నిర్వహించిన సర్వే వల్ల ప్రస్తుతం అనేక భూ సమస్యలు ఎదురవుతున్నాయని, దీన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం భూరీసర్వే కార్యక్రమాన్ని తలపెట్టిందని, దీనివల్ల ప్రస్తుతం ఉన్న సమస్యలు పరిష్కారమవుతాయని జిల్లా సర్వే ల్యాండ్ రికార్డు అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. రెవెన్యూ సిబ్బందితో పాటు సర్వేయర్లు చురుగ్గా రీ సర్వే చేస్తున్నారన్నారు. సరిపడా సచివాలయ సర్వేయర్లు లేకపోయినా సెలవుల్లోనూ విధులు నిర్వహించి రీసర్వే ప్రక్రియ పూర్తికి కృషి చేస్తున్నామని చెప్పారు. రీసర్వే ప్రక్రియతో భవిష్యత్తులో భూ సమస్యల తలెత్తే అవకాశాలుండవని స్పష్టం చేశారు. జిల్లా చేపడుతున్న రీసర్వే, ఇతర అంశాలపై ప్రజాశక్తి ముఖాముఖితో ఆయన మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే....

-ప్రజాశక్తి, కలెక్టరేట్

రీసర్వే ఆవశ్యకత ఏమిటి?

మనదేశంలో సుమారు వందేళ్ల క్రితం సర్వే నిర్వహించారు. అప్పటికీ, ఇప్పటికీ భూ స్వరూపంలోనూ, క్షేత్రస్థాయిలో ఎన్నో మార్పులు జరిగాయి. ఇప్పుడు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి ఖచ్చితమైన, స్పష్టమైన హద్దులు, కొలతలతో కూడిన భూ పత్రాలను అందజేయడానికి ప్రభుత్వం చేపట్టిన ఒక మహత్తర కార్యక్రమం భూరీసర్వే.

జిల్లాలో ఇంతవరకు ఎన్ని గ్రామాల్లో రీ సర్వే పూర్తయ్యింది?


జిల్లాలో మొత్తం 965 గ్రామాలు ఉండగా, 556 గ్రామాల్లో డ్రోన్ ఫ్లై పూర్తి అయ్యింది. రీసర్వే మొదటి విడత 95 గ్రామాల్లో 39,573 ఎకరాలు రీసర్వే పూర్తి చేశాం. రెండో దశలో భాగంగా జిల్లాకు 187 గ్రామాలను లక్ష్యంగా కేటాయించగా ఇప్పటికే, 48 గ్రామాల్లో రీసర్వే పూర్తయింది. మిగిలిన గ్రామాల్లో సర్వే వివిధ దశల్లో ఉంది. రెండో దశలో మిగిలిన గ్రామాల రీ సర్వే మే ఆఖరి కల్లా పూర్తి అవుతుంది. ప్రస్తుతం మొదటి విడతలో రీసర్వే పూర్తయిన 58 గ్రామాల్లో సర్వేరాళ్లు పాతే పనులు జరుగుతున్నాయి.

రీ సర్వేలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కార మార్గాలు ఏమిటి?

రీసర్వే జరిగిన ప్రాంతంలోని రైతులకు 9(2) నోటీసులు ఇవ్వడం జరుగుతుంది. ఈ నోటీసుల్లో రైతులకు ఏమైనా అభ్యంతరాలు, అనుమానాలు ఉంటే సంబంధిత తహశీల్దార్ కార్యాలయంలో మొబైల్ మెజిస్ట్రేట్‌గా డిప్యూటీ తహశీల్దార్‌ను సంప్రదించి వారి సమస్యలను పరిష్కరించుకోవచ్చు.

రీసర్వే పట్ల అవగాహన కోసం ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

రీసర్వే పట్ల అవగాహన కోసం ఏ గ్రామంలో రీసర్వే జరుగుతుందో ఆ గ్రామంలో ముందుగా గ్రామ సభ ఏర్పాటు చేసి ఆ గ్రామంలోని రైతులందరికీ రీ సర్వే గురించి వివరించడం జరుగుతుంది. రైతులంతా తమ ప్రాంతంలో జరుగుతున్న సమయంలో కచ్చితంగా హాజరై తమ హద్దులను, సమస్యలను తెలియజేయడం ద్వారా రీసర్వేలో ఖచ్చితమైన, స్పష్టమైన కొలతలు, హద్దులు గుర్తించగలుగుతారు.



ప్రస్తుతం మన జిల్లాలో ఎంతమంది సచివాలయ సర్వేయర్లు ఉన్నారు?

మన జిల్లాలో 312 మంది సచివాలయ సర్వేయర్లు అవసరం కాగా, ప్రస్తుతం 250 మంది ఉన్నారు. ఇప్పుడున్న సర్వేయర్లు రీసర్వే పనుల్లో ఎంతో చురుగ్గా పాల్గొని సెలవు దినాల్లో కూడా పనిచేస్తూ జిల్లాలో రీసర్వే పనులు వేగవంతానికి సహకరిస్తున్నారు.

ఏప్రిల్ 10 నేషనల్ సర్వే డే ఆవశ్యకత ఏమిటి?

బ్రిటీష్ సర్వేయర్ అయినకర్నాల్ విలియం లాంబ్టాన్ ఎటువంటి ఆధునిక పరికరాలు అందుబాటులో లేని కాలంలో ఎన్నో వ్యయ ప్రయాసలతో 1802 ఏప్రిల్ 10న చెన్నైలోని సెంట్ థామస్ మౌంట్ జిటిఎస్ ప్రథమ బేస్ లైన్ ఖచ్చితమైన కొలతలను అక్షాంశ, రేఖాంశ సహితం నిర్ధారించడంలో అపూర్వమైన అనితర సాధ్యం సాధించారు. తదుపరి మౌంట్ ఎవరెస్ట్ సర్వే ప్రక్రియ కొనసాగించారు. కనుక ఆ సందర్భంగా ఏప్రిల్ 10న దేశమంతా నేషనల్ సర్వే డే జరుపుకోవడం జరుగుతుంది.



బాధితులకు ఆర్థికసాయం అందజేస్తున్న హెచ్‌సి కృష్ణమూర్తి

బాధితులకు ఆర్థిక సాయం

కొమరాడ : మండలంలోని సర్కాపాంలో జబీవల గోడ కూలిన ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు పార్వతీపురంటౌన్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న వృద్ధుమిత్ర కోఆర్డినేటర్ కృష్ణమూర్తి ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం సర్కాపాంలో బాధిత కుటుంబాలకు సర్పంచ్ గంగాధర్ ఆధ్వర్యంలో 75 కేజీల బియ్యం, రూ.5వేలు చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రతినెల తనకొచ్చిన జీతంలో సగానికి పైగా పేద ప్రజలకు, అనాథల కోసం ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. సందర్భంగా ఆయన్ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సాంబమూర్తి, గ్రామస్తులు పాల్గొన్నారు.

డ్రగ్స్ ఆంధ్రప్రదేశ్‌గా మార్చేశారు

వీరఘట్టం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని వైసిపి ప్రభుత్వం డ్రగ్స్ ఆంధ్రప్రదేశ్‌గా మార్చేసిందని పాలకొండ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు పారిశర్ల వెంకటరమణ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో డ్రగ్స్ వ్యాపారం విచ్చలవిడిగా సాగుతుందని, దీన్ని ఆసరాగా తీసుకుని వైసిపి నాయకులు కోట్లాది రూపాయలు సంపాదించుకుంటున్నారని ఆరోపించారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో అత్యధికంగా డ్రగ్స్ పట్టుబడిన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలబెట్టారని విమర్శించారు. ఈ నెల 7న విశాఖపట్నం నుండి తుని వైపు వెళ్తున్న లారీలో సుమారు 1100 కేజీల గంజాయిని పట్టుకున్నారని ఆయన ఆరోపించారు. డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణాలో దేశంలో నెంబర్ వన్‌గా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని విమర్శించారు. ఇటువంటి అరాచక ప్రభుత్వాన్ని తరిమికొట్టడానికి ప్రజల సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు తిరుపతిరావు

అభ్యర్థి ఎవరైనా పార్టీ గెలుపే ముఖ్యం

మక్కువ : రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరైనాప్పటికీ గెలుపే లక్ష్యంగా అందరూ పని చేయాలని టిడిపి సీనియర్ నాయకులు పెంట తిరుపతిరావు అన్నారు. మండలంలోని వెంకంపేటలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, సర్పంచిలతో పాటు ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి బలోపేతానికి కృషి చేయాలని, గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రభుత్వ వైఫల్యాలని ప్రజల్లోకి తీసుకువెళ్తూ గతంలో టీడీపీ హయాంలో చేసే అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అన్నారు. అధిష్టానం నిర్ణయించి ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించే బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో శంబర ఎంపిటిసి సభ్యులు తీళ్ల పోలినాయుడు, కోన సర్పంచి బొత్స మహాలక్ష్మి కన్నంనాయుడు, మాజీ సర్పంచులు, మత్స భాస్కరరావు, దాకేటి దేవకీ పరమహంశ, చొక్కాపు బుచ్చినాయుడు, మేలాపు శ్రీనివాసరావు, వెలమల జగన్నాథం, చప్ప తిరుపతిరావు, గాడి సత్యం తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి చినబగ్గ కొండపై యాత్ర

సీతంపేట : మండలంలోని చిన్నబగ్గ కొండపై ఈనెల 23 నుండి 27 వరకు లక్ష్మీనరసింహ స్వామి యాత్ర నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ నీలయ్య తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

నేడు పెన్షనర్ల సమావేశం

పార్వతీపురంరూరల్ : పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని బెలగాంలో రైతు బజార్ వద్ద ఉన్న పెన్షనర్ ల భవనంలో సోమవారం నెలవారి సమావేశం జరుగుతుందని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి డి.గణపతిరావు తెలిపారు. ఈ సమావేశంలో ఇన్‌కమ్ టాక్స్ విషయాలను వివరించేందుకు చార్టెడ్ అకౌంటెంట్ వస్తున్నారని, కావున ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల అంతా హాజరుకావాలని కోరారు.

శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పండగ

బొబ్బిలి రూరల్: : శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా గ్రామ దేవత పండుగ నిర్వహిం చాలని ఎం.బూర్జవలస గ్రామ దేవత ఉత్సవ కమిటీను పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు కోరారు. ఎం.బూర్జవలసలో ఆదివారం సాయంత్రం ఉత్సవ కమిటీతో ఆయన సమావేశం నిర్వహించారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పండుగ నిర్వహించాలన్నారు. డిజెలు, అశ్లీలత నృత్యాలు పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతో ఎస్ఐ జ్ఞానప్రసాద్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

సిరిమానోత్సవానికి చెట్టు సేకరణ

బొబ్బిలి : మున్సిపాలిటీ పరిధిలో ఉన్న మల్లంపేట కొత్తపోలమ్మతల్లి గ్రామ దేవత పండుగ నేపథ్యంలో సిరిమానోత్సవానికి ఆదివారం చెట్టు కొట్టారు. గ్రామ సమీపంలో ఉన్న చెట్టుకు బుడా చైర్మన్ ఇంటి పార్వతి, కౌన్సిలర్లు తెంటు పార్వతి, కల్యంపూడి లక్ష్మి, వైసిపి పట్టణ అధ్యక్షులు ఇంటి గోపాలరావు, వైసిపి, టిడిపి నాయకులు తెంటు శివ అప్పలనాయుడు, కల్యంపూడి సత్యనారాయణ, ఉత్సవ కమిటీ సభ్యులు పూజలు చేసి సిరిమాను చెట్టు కొట్టారు. ఊరేగింపుగా గ్రామానికి చెట్టు తరలించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల కోలాటం

రేగిడి : మండలంలోని సంకిలి గ్రామంలో చిన్నారుల కోలాటం పలువురిని ఆకట్టుకున్నాయి. రాజాం మండలం బొద్దాం గ్రామానికి చెందిన విద్యార్థులు కోలాటం నేర్చుకుని ఆయా గ్రామాల్లో పండగలకు, సంబరాలకు, తిరునాళ్ల సందర్భాల్లో కోలాటం ప్రదర్శనలుస్తుంటారు. శ్రీరామ ముగింపు సందర్భంగా ఆదివారం సంకిలి గ్రామంలో కోలాట ప్రదర్శన నిర్వహించడంతో పలువురు చూసి అభినందించారు. చిన్నారులకు ప్రోత్సాహకాలు అందించారు.

నవోదయ మాక్ టెస్ట్‌కు విశేష స్పందన

కొత్తవలస : స్థానిక విజ్ఞాన్ కోచింగ్ సెం టర్ ఆధ్వర్యంలో ఆది వారం నిర్వహించిన నవోదయ మాక్ టెస్ట్‌కు విశేష స్పం దన లభిం చింది. విజయన గరం, శ్రీకాకుళం, అనకాపల్లి, విశాఖ పట్నం జిల్లాలోని వివిధ మండలా లకు చెందిన 267 మంది నవోదయకు శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఈ మాక్ టెస్ట్‌కు హాజరైనట్లు విజ్ఞాన్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు బగాది రమణ, పైడి ప్రసాద్, బగాది కోటేశ్వరరావులు తెలిపారు. మాక్ టెస్ట్‌లో అత్యధికంగా 85 మార్కులు సాధించిన కె. కుశ్వంత్ కుమార్ (కొత్తవలస) ప్రథమ స్థానంలో విజేతగా నిలిచాడు. జోడుమెరకకు చెందిన జోడు దీపక్ 84 మార్కులతో 2వ స్థానంలోనూ, దత్తి గ్రామానికి చెందిన పి. జోహిత్ 83 మార్కులతో 3వ స్థానంలో నిలిచారు. వీరితో పాటు వరుసుగా మరో ఏడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రధాన పరీక్షలో చక్కని ప్రతిభను కనబరచి ఉత్తీర్ణత సాధించాలని పలువురు ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గుంజి కిట్లు పంపిణీ

బాడంగి : మండలంలోని ఎరుకులపాక గ్రామంలో ఆదివారం దీక్ష మహిళ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 80 మందికి గుంజి కిట్లును పంపిణీ చేశారు. గ్రామంలో గల కాలువలను, రోడ్లను పరిశుభ్రం చేసి అనంతరం దేవాలయం చుట్టూ ఉన్న చెత్తను వీరు తొలగించారు. గ్రామ పారిశుధ్యంపై ప్రతి ఒక్కరూ తమ వంతుగా శుభ్రంగా ఉంచుకోవాలని దీక్ష మహిళలకు సొసైటీ సెక్రటరీ ఎల్ శాంతి పిలుపునిచ్చారు.

పలుచోట్ల 'మా నమ్మకం నీవే జగనన్న'

ప్రజాశక్తి - పాచిపెంట

జిల్లాలోని పలుచోట్ల మా నమ్మకం నీవే జగనన్న కార్యక్రమాన్ని వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు ఆదివారం నిర్వహించారు. మండలం పి.కోనవలస. గైరమ్మ పేట, పలుకువలస గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన మా నమ్మకం నీవే జగనన్న కార్యక్రమంలో డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి తమ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు మీకు నచ్చినట్లయితే మరోసారి వైసిపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. అలాగే వైసిపీ ప్రభుత్వం వచ్చాక చేకూరిన లబ్ది పొందిన ప్రయోజనాలతో పాటు గత ప్రభుత్వం హామీలు నెరవేర్చకుండా మోసగించిన విధానాన్ని రెండు ప్రభుత్వాలకు మధ్య వ్యత్యాసం వివరించారు. కార్యక్రమంలో పి.వీరమనాయుడు, టి.గౌరీశ్వరరావు, సిహెచ్ సీతారామకృష్ణ, ఎం.ఉమామహేశ్వరరావు, జి.తిరుపతిరావు, జెడ్‌పి వైస్‌చైర్మన్ కె.సింహాచలం, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాం : మండలంలోని బియ్యాలవలసలో ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్పిటిసి జి. సుజాత ఇంటింటికి వెళ్లి గత ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, ప్రస్తుత వైసిపి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో వైసిపి గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, కురుపాం సర్పంచ్ జి.సుజాత ఎంపీటీసీ జి.సంతోషిని, వైసిపీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు , వాలంటీర్లు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని గాదెలవలసలో అలజంగి జోగారావు ఆధ్వర్యాన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం చేపట్టారు. సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, వైసిపి నాయకులతో కలిసి గ్రామంలో ఇంటి ఇంటికి వెళ్లి ప్రజలను నేరుగా కలుసుకొని వారికి వైసిపి ప్రభుత్వం చేకూరిన లబ్ధి, పొందిన ప్రయోజనాలతో పాటు గత ప్రభుత్వంలో మోసపోయిన, మోసగించిన విధానాన్ని విడమరిచి రెండు ప్రభుత్వాలకు మధ్య ఉన్న వ్యత్యాసాలను వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మామిడి బాబ్జీ, ఎంపీపీ ప్రతినిధి బలగ శ్రీరాములు నాయుడు, సర్పంచ్లు బొన్నాడ తిరుపతి రావు, సిరికి మహేశ్, స్టేట్ డైరెక్టర్ ఎస్ తిరుపతి రావు, సీనియర్ నాయకులు బి ముకుంద, కన్వీనర్లు, గహసారథులు బి శివకుమార్, వైసిపి కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


జియ్యమ్మవలస మండలంలోని లక్ష్మీపురంలో జగనన్న నువ్వే మా నమ్మకం కార్యక్రమం పిఎసిఎస్ అధ్యక్షులు తాడేల మన్మధరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను వివరించారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల తీరుపై ప్రజలకు వివరిస్తూ వారితో చర్చిస్తూ ప్రజల మద్దతును కోరారు. ప్రతి ఇంటికి స్టిక్కర్లు అంటిస్తూ ప్రచారం నిర్వహించారు.

భామిని: మండలంలోని బిల్లుమడలో ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలం, సర్పంచ్ సిగడాన రాజు, బాలేరులో మండల జెసిఎస్ కన్వీనర్ కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచ్ జామి ప్రభాకర్, భామినిలో సచివాలయం కన్వీనర్ రొక్కం రమేష్, కృష్ణ, వైసిపి నాయకులు కొల్ల రామారావు, సంజీవురావు, తలడా, తాటిమానుగూడలో వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, జెడ్‌పిటిసి బొడ్డేపల్లి ప్రసాదరావు, సర్పంచ్ పాపినాయుడు ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్: పట్టణంలోని బెలగాంలో 21వ వార్డు పరిధిలో గల సౌందర్య థియేటర్ రోడ్డు, జనశక్తి కాలనీల్లో ఎమ్మెల్యే ఎ.జోగారావు సారథ్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వార్డు సచివాలయం కన్వీనర్లు, గహసారథలు, వైసీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇంటి ఇంటికి వెళ్లి తలుపులపై జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ అనే స్టికర్, ఫోన్ పై స్టిక్కరు అంటించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, సీనియర్ నాయకులు, జెసిఎస్ కన్వీనర్ జి.మాధవరావు, సీనియర్ నాయకులు జక్కు చిన్నంనాయుడు, కన్వీనర్లు వెంకట లక్ష్మీ, గృహసారథులు ఎన్.త్రినాథ, కె.రత్నమ్మ, వైసిపి కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పాచిపెంట : పి.కోనవలసలో ప్రచారంలో పాల్గొన్న డిప్యూటీ సిఎం రాజన్నదొర



సీతానగరం : గాదెవలసలో కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు



కురుపాం : బియ్యాలవలసలో ప్రచారం చేస్తున్న ఎంపిపి, వైసిపినాయకులు

గిరిజనులంటే వైసిపికి చిన్నచూపు

ప్రజాశక్తి - సాలూరురూరల్

జగన్ ప్రభుత్వానికి గిరిజనులంటే చిన్నచూపని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుమ్మడి సంధ్యారాణి విమర్శించారు. మండలంలోని సారికలో ఆదివారం జరిగిన ఓ ప్రయివేట్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కొదమ పంచాయతీలో ఐదు గిరిజన గ్రామాలకు మార్చి నుంచి బియ్యం ఇప్పటివరకు ఇవ్వలేదని, మాసికవలస, ఎం.చింతలవలస, మోనంగి తదితర ఐదు గ్రామాల గిరిజనులకు మార్చి నెల బియ్యం ఇప్పటికీ ఇవ్వకపోతే గిరిజనులు ఏం తిని బతకాలని ప్రశ్నించారు. తక్షణమే ఈ ఐదు గ్రామాల గిరిజనులకు రేషన్ అందించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున నిరసనలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 18 రకాల గిరిజన పథకాలను రద్దు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఫీడర్ అంబులెన్స్‌ను నిర్వీర్యం చేస్తుందన్నారు. గిరిజన గర్భిణులకు వైటీసీలను ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం, పౌష్టికాహారం అందిస్తే అది కూడా ఈ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పర్యటనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఉద్దేశించి గో బ్యాక్ అనడంపై ఆంతర్యమేమిటని ధర్మేంద్ర ప్రధాన్ మాటలు కేంద్రమంత్రా లేక ఒడిశాకు మాత్రమే మంత్రా అన్నట్టుగా వ్యవహరించారన్నారు. ఇప్పటి వరకు జగన్ ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. ఖనిజ సంపద గల కొఠియా గ్రామాలపై జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అమ్ముడుపోయిందని స్పష్టంగా అర్థమవుతుందని, వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రిని బర్తరఫ్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు విలేకరుల సమావేశంలో పలువురు గిరిజన టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పనసభద్రలో దాహం కేకలు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని ఊసకొండ పంచాయితీ గిరిశిఖర గ్రామమైన పనసభద్రలో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ గ్రామంలో ఇంటింటికి కొళాయి పథకం నిర్మాణం పూర్తయినా, నేటికీ ప్రారంభించకపోవడంతో ఒకే ఒక్క చేతి బోరును ఆశ్రయించాల్సి వస్తోంది. వేసవి సమీపించడంతో చాలాసార్లు అధికారులకు తమ గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని పలుమార్లు వినతి పత్రాలు అందించినా పట్టించుకొనే నాథుడే కరువయ్యాడని అన్నారు. ఇంటింటికీ తాగునీటి పథకం నిర్మాణం పూర్తయినప్పటికీ ఇంతవరకు తాగునీరందించే దాఖలాలే లేవన్నారు. ప్రస్తుతం ఉన్న ఇంటింటి కుళాయిలు దిష్టిబొమ్మలా ఉండడం తప్ప వాటి వల్ల తమకు ఉపయోగం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్న మోటర్ ద్వారా కరెంటు ఉంటేనే నీరు పట్టుకోగలుగుతున్నామని లేని సమయంలో ఊట బావిల్లో గెడ్డల్లో నీరు తాగాల్సి పరిస్థితి వస్తుందని వాపోయారు. దీంతో అనారోగ్యాలు గురవుతున్నామన్నారు. కావున ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమకు తాగునీరు అందించాలని కోరుతున్నారు.



నీళ్లు రాక నిరుపయోగంగా ఉన్న ట్యాపులు

ఘనంగా ఈస్టర్ వేడుకలు

ఏసుక్రీస్తు మరణించిన మూడురోజుల అనంతరం తిరిగిన లేవడాన్ని పురస్కరించుకొని క్రైస్తవులు ఆదివారం ఈస్టర్ వేడుకలు జిల్లాలో ఘనంగా నిర్వహించారు. పలు చర్చిల్లో పెద్దఎత్తున ప్రార్థనలు నిర్వహించారు. ఈస్టర్ ప్రాధాన్యతను ప్లాస్టర్లు వివరించారు.

కురుపాం : స్థానిక రావాడ జంక్షన్ సమీపాన గల గుడ్ సమారిటన్ లూథరన్ చర్చిలో పునరుద్ధరణ ఆరాధనను పాస్టర్ రెవరెండ్ పి.జీవన్ కుమార్ ప్రకాష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చర్చిలో పునరుద్ధరణ ఆరాధన ప్రాముఖ్యత గూర్చి క్రైస్తవులకు ఏసుక్రీస్తు గుడ్ ఫ్రైడే దినన్నా మరణించి తిరిగి మూడు రోజుల తర్వాత లేవడంతో ఈస్టర్ పండగను క్రైస్తవ విశ్వాసులు ఘనంగా జరుపుకుంటారని క్రైస్తవ విశ్వాసులను ఉద్దేశించి పునరుద్ధరణ ఆరాధన ప్రాముఖ్యతను సంఘ విశ్వాసులకు బోధించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు దొనక జాన్, దొనక రాజరత్నం, దొనక ప్రదీప్, దొనక జయకుమార్, కోట సుందర్ సుదర్శన్, కోట ఈశ్వరరావు, డి.మజ్జిబాబు, కె. రత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలో ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి. వీరఘట్టం తెలుగు బాప్టిస్ట్ దేవాలయంలో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సంఘకాపరి పి.విన్స్‌కుమార్, సంఘస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని గొయిది కొండపై గల ఫాతిమా మాతా చర్చిలో ఈస్టర్ పండుగ సందర్భంగా ఫాదర్లు జయశీలన్, అశోక్, జోజి, సోమగండి ఆర్ సి ఎం సెర్చ్‌లో కేక్ కట్ చేశారు. అనంతరం ఈస్టర్ ఆవశ్యకతను వివరించారు.



వీరఘట్టం : ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు

వరహాల గెడ్డలో సారా ప్యాకెట్లు ప్రవాహం

పార్వతీపురంటౌన్ : జిల్లా కేంద్రం, పట్టణ నడిబొడ్డున ప్రధాన రహదారికి అనుకొని ఉన్న వరహాలగెడ్డలో నాటు సారా ప్యాకెట్లు ప్రవహిస్తున్నాయి. పట్టణంలోని నాటు సారా వ్యాపారం మూడుపువ్వులు, ఆరు కాయల్లా వర్ధిల్లుతుం డడంతో మందుబాబు సారా తాగి ఆ ప్యాకెట్లును గెడ్డలో వేస్తున్నారు. వీటితో పాటు చెత్తలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, పలు వాణిజ్య సముదా యాలు, హెూటళ్ల వ్యర్థాలు గెడ్డలోనే వేస్తున్నారు. అలాగే పట్టణంలో పలు వార్డుల్లో నివాస గృహాల వాడుక నీరు కూడా మురుగు కాలువల ద్వారా వరహాల గెడ్డలోకి చేరుతుంది. ఈ వ్యర్థాల కారణంగా నీరు ప్రవహించేందుకు అవకాశం లేక ఎక్కడికక్కడ నీరు నిలిచిపోతుంది. దీంతో ప్రతి ఏటా వర్షాకాలానికి ముందు లక్షలాది రూపాయలు ప్రజాధనం వెచ్చించి గెడ్డలో పూడికలను తొలగించాల్సి వస్తోంది. అయినా ఫలితం లేకుండా పోతుంది. ఇప్పటికైనా గెడ్డలో వ్యర్థాలను వేయ కుండా పర్యవేక్షించేలా అధికారులు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



గెడ్డలో పేరుకుపోయిన సారా ప్యాకెట్లు

నగర పంచాయతీ పీడిస్తున్న అపారిశుధ్య సమస్య

ప్రజాశక్తి-పాలకొండ/పాలకొండరూరల్

డివిజన్ కేంద్రమైన పాలకొండ నగర పంచాయతీని పారిశుధ్య సమస్య పట్టిపీడిస్తుంది. ఎంత మంది అధికారులు మారినా పారిశుధ్య సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. 2013 మార్చిలో నగర పంచాయతీగా ప్రభుత్వం మార్చినప్పటికీ నేటికీ పారిశుధ్యం అధ్వాన్నంగా ఉంది. పారిశుధ్య సమస్యపై అధికారులు దృష్టిపెట్టిన దాఖలాలు లేవు. పారిశుధ్య నిర్వహణ కోసం ప్రతినెలా లక్షల్లో నిధులు డ్రాచేస్తున్నా ఆ సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవడం లేదు. పట్టణంలో 20 వార్డుల పరిధిలో 353 వీధులున్నాయి. ప్రధాన రహదారులతో పాటు నెయ్యిలవీధి, లుంబూరువారి వీధి, కోమటిపేట, రామకళామందిర్ వీధి తదితర ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉంది. దీంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి చెందుతున్నారు. కాలువల్లో కూడా మురుగునీరు నిల్వ ఉండిపోవడంతో వెంకంపేట, గొడగలవీధి, చిన్నగొల్లవీధి, గురువుగారి వీధి ప్రాంతాల్లో మురుగునీరు కాలువల్లో నిల్వ ఉండిపోతుంది. దీంతో దోమల బెడద వెంటాడుతుంది.

పట్టించుకోని కమిషనర్....

నగర పంచాయతీలో పారిశుధ్య నిర్వహణపై నగర పంచాయతీలో ఏ ఒక్కరూ స్పందించడం లేదు. రెగ్యులర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో పారిశుధ్య నిర్వహణపై ఏ ఒక్క అధికారి దృష్టిపెట్టే పరిస్థితి లేదు. కొత్తగా వచ్చిన కమిషనర్ కనీసం వార్డుల్లో పర్యటించిన దాఖలాలు కూడా లెవు. పూర్తిగా కాంట్రాక్ట సిబ్బందితొనె పారిశుధ్య నిర్వహణను చెయిస్తున్నారు. దీంతో నగర పంచాయతీ తీరుపై ప్రజలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు.



రామా కళామందిర్ వద్ద రోడ్డుపై ఉన్న చెత్త

రాజేశ్వరరావు ఆశయాలను సాధిస్తాం

బొబ్బిలి : భూ పోరాట యోధుడు, తనకున్న యావదాస్తిని పేద ప్రజలకు పంచిన మహానేత సిపిఐ ఉద్యమ నిర్మాత కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు ఆశయాలను సాధిద్దామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ అన్నారు. పట్టణంలో ఆదివారం రాజేశ్వరరావు 29వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఈ నెల 11న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా విజయవాడ కేంద్రంగా జరగనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట అప్పన్న, సిపిఐ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్, నాయకులు పి.కృష్ణ, జోగి నాయుడు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి : డిఐఒ

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

ఎండల్లో పనిచేసే వారు వేసవి జాగ్రత్తలు తప్పనిసరి పాటించాని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని వెంకంపేట, పెదబొండపల్లి గ్రామాలను ఆదివారం ఆయన సందర్శించి వేసవిలో ప్రబలే అనారోగ్య లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండడం వల్ల శరీరంలో నీటి శాతం తగ్గిపోతుందని, ముఖ్యంగా బయట ప్రాంతాల్లోనూ, ఎండలో పనిచేసే వారిపై మరింతగా ప్రభావం చూపుతుందని అన్నారు. సరైన ముందస్తు జాగ్రతలు తీసుకోకపోతే వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. వడదెబ్బకు గురయ్యేటప్పుడు చర్మం పొడి బారడం, తలనొప్పి, వికారం, స్పృహ కోల్పోవడం సంభవిస్తాయని, ఇలాంటప్పుడు గురైన వ్యక్తిని వెంటనే దగ్గర ఉన్న నీడ ప్రాంతంలో ఉంచి, తడి గుడ్డతో శరీరం తుడవాలని, గాలి తగిలేలా చూడాలని, స్పృహలో ఉన్నప్పుడు మాత్రమే నీరివ్వాలని సూచించారు. తదుపరి ఓఆర్‌ఎస్ ద్రావణం ఇచ్చి తీవ్రతను బట్టి దగ్గరలో ఉన్న ఆసుపత్రిలో చేర్చాలన్నారు. వృత్తి రీత్యా గానీ, ఏదైనా పనిమీద బయటకు వెళ్లేముందు నీరు, మజ్జిగ, నిమ్మరసం మొదలగు ద్రావణాలు తాగాలని, అలాగే నీరు వెంట తీసుకువెళ్లాలని, అత్యవసరమైతే తప్ప ఉదయం 11 - 3 గంట మధ్య బయట తిరగరాదని సూచించారు. టోపీ లేదా గొడుగు ఉంచుకోవాలని, దాహం వేసే వరకు వేచి ఉండకూడదని ఎప్పటికప్పుడు నీరు, మజ్జిగ, నిమ్మరసం, బార్లీ మొదలగు ద్రావణాలను ఇంట్లో అందుబాటులో ఉంచుకొని తాగాలని సూచించారు. తద్వారా డీ హైడ్రేషన్‌కు గురికాకుండా ఉంటామన్నారు. సాధ్యమైనంత వరకు నీటి శాతం సమృద్ధిగా లభించే ఆహారం తీసుకోవాలని, ఎక్కువగా దాహార్తి ని కలిగించే ఆహారానికి దూరంగా ఉండాలని సూచించారు. చిన్న పిల్లలు, వృద్దులు, గర్భిణీల పట్ల మరింత జాగ్రత్త తీసుకోవాలని, ఇంటి నివాసాల్లో గాలి బాగా తగిలేలా చూసుకోవాలని అన్నారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది వద్ద ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని, వాటిని వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది జయగౌడ్, దుర్గాప్రసాద్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



గ్రామస్తులకు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్న డిఐఒ జగన్మోహనరావు